క్లుప్తంగా

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి

నేరడిగొండ: విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో మండల విశ్వబ్రాహ్మణుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై తీర్మానం చేశారు. ఇందులో భాగంగా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీ రామోజు నారాయణ, అధ్యక్షుడిగా మండజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీ రామోజి వెంకట రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడల్లో రాణించాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై సునీల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో వడగామ్ గ్రామపంచాయతీ పరిధిలోని మోడిగూడ యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఏఎస్సై భీంరావ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బోథ్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా బోథ్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, ఫొటో ఐడెంటిఫికేషన్ పోటీలు నిర్వహించారు. ఆదివారం స్థానిక ప్రగతి పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో దాదాపు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 12న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రోహిత్, సాయికృష్ణ, అనిల్, కార్తీక్, కుషాల్, ఉపాధ్యాయులు రవితేజ, సుమేర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో పర్యటించారు. రోడ్డు, భగీరథ నీరు, విద్యుత్, పింఛన్ తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులతో సమస్యలపై చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట నాయకులు ఉన్నారు.

పట్టణంలో ఎన్నికల సందడి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం పలు సంఘాల ఎన్నికలు నిర్వహించగా సాధారణ ఎన్నికల సందడి వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగగా, మరోవైపు బారే సమాజ్ పట్టణ అధ్యక్ష ఎన్నికలు, ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ జిల్లా అసోసియేషన్ ఎన్నికలు సైతం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను తలపించేలా మేనిఫెస్టోలు సైతం రూపొందించి గత కొన్ని రోజులుగా పోటా పోటీగా ప్రచారం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి

ఉట్నూర్: ప్రభుత్వ చర్యల వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోయారని, ప్రభుత్వం 2023 పీఆర్సీ నూతన కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చౌహాన్ సునీల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు కరువు (డీఏ) భత్యాలు విడుదల చేయలేదన్నారు. సమావేశంలో టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, కుమ్రా చందు, రాజ్‌కుమార్, మేఘనాథ్, కిరణ్, రాం కుమార్, రవి కుమార్, పృథ్వీరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మండల కమిటీ ఎన్నిక

ఉట్నూర్ మండల కమిటీని ఎనుకున్నారు. టీపీయూఎస్ ఉట్నూర్ మండల అధ్యక్షుడిగా పి.వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సుభాష్, ఉపాధ్యక్షుడిగా పృథ్వీరాజ్, గౌరవ అధ్యక్షుడిగా సుభాష్, మహిళా అధ్యక్షురాలిగా సంగీత, మహిళా కార్యదర్శిగా సంధ్యారాణి, కార్యదర్శులుగా ధరంసింగ్, ప్రవీణ్ లను ఎన్నుకున్నారు.

12న కలెక్టరేట్ ఎదుట ధర్నా

తాంసి: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని ఈనెల 12న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు అఖిలపక్ష రైతు సంఘం జిల్లా నాయకుడు దారుట్ల కిష్టు తెలిపారు. ఆదివారం మండలంలోని తాంసి, జామిడి, కప్పర్లతో పాటు భీంపూర్ మండలంలోని పలు గ్రామాలలో రైతు సంఘం నాయకులతో పర్యటించి రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని విన్నవించారు. అగ్ని ప్రమాదంలో పత్తి కాలిపోయిన మంత్రి రాజు ఇంటి వెళ్లి పరిశీలించారు. సీసీఐ బహిరంగ మార్కెట్‌లో కమర్షియల్ పద్ధతిలో పత్తి కొనుగోలు చేయకపోవడం ధరలు తగ్గుతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు లోకారి పోశెట్టి, విజ్జగిరి నారాయణ, కేమ లక్ష్మణ్, సామ సంతోష్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

జంగీ జాతరకు వేళాయె



బైరందేవ్ విగ్రహం



ముస్తాబవుతున్న మహాదేవ్ ఆలయం

- ఈనెల 15 నుంచి ప్రారంభం
- ముస్తాబు కానున్న బైరందేవ్, మహాదేవ్ ఆలయాలు
- వారం రోజులు కొనసాగనున్న జాతర

బేల: ప్రతీ ఏటా పుష్య మాసంలో వారం రోజుల పాటు నిర్వహించే జంగీ జాతర మండలంలోని అటవీ సమీపంలోని సదల్‌పూర్ బైరందేవ్, మహాదేవ్ ఆలయాల వద్ద జాతర ఈనెల 15 నుంచి ప్రారంభం కానుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. వారం రోజుల పాటు కొనసాగించి, అమావాస్య రోజు కాలదహీ హండీ కార్యక్రమం నిర్వహించి, జాతరను ఘనంగా ముగిస్తారు. ఆదివాసీ పూర్వీకుల సాంప్రదాయ బద్ధంగా 54 ఏళ్ల నుంచి జాతర, 29 ఏళ్ల నుంచి దర్బార్ సభ నిర్వహిస్తున్నారు.

ఆలయాల ప్రత్యేకత ఇది..

ఆదివాసీల ఆరాధ్య దైవమైన బైరందేవ్, మహాదేవ్ ఆలయాలు శాతవాహనుల కాలంలో నల్లరాతితో నిర్మించబడి, అందమైన శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. మనసులో ఏదైనా కోరుకొని బైరందేవ్ ఆలయంలోని లింగాన్ని ఎత్తితే, లింగం తేలికగా లేస్తే పని జరుగుతుందని భక్తుల నమ్మకం. ఈఆలయాలకు ఆదివాసీలే కాకుండా ఇతరులు కూడా అధికంగా వస్తుంటారు. మండలం నుంచే కాకుండా జైనథ్, నార్నూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, ఉట్నూర్ మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి దర్శనం కోసం భక్తులు వస్తుంటారు. ఈ ఆలయాలు అడవికి సమీపాన ఉండడంతో జంగీ జాతరగా పిలుస్తుంటారు.

ప్రారంభం కానున్న ఏర్పాట్లు..

జాతర దృష్ట్యా రెండు రోజుల్లో జాతర ఏర్పాట్లు ప్రారంభం కానున్నాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టనున్నారు. క్యూలైన్ కోసం, ఆలయాల చుట్టూ ప్రత్యేక జాలి ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయం, దుకాణాలతో పాటు విద్యుత్ దీపాల అలంకరణ చేయనున్నారు.

జాతర షెడ్యూల్..

ఈనెల 15న జాతర ప్రారంభం కానుంది. 17 నుంచి కబడ్డీ పోటీలు ప్రారంభం అవుతాయి. 19న ఆదివాసీ దర్బార్ సభ ఉంటుంది. 21న కాలదహీ హండీ నిర్వహణతో జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మారని ఆలయాల రూపురేఖలు..

ఆలయాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతు నిర్మాణ పనుల అభివృద్ధి కోసం కమిటీ వారు గత 11ఏళ్ల క్రితం దేవదాయ శాఖ అధికారులకు విన్నవించారు. అధికారులు సైతం వచ్చి చూసి వెళ్లారు. కానీ ఇంతవరకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. బైరందేవ్ ఆలయ శిఖర భాగం ఒక్కొ రాయి కూలుతున్నదని, ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క మహాదేవ్ ఆలయం వర్షానికి ఊరుస్తుండడంతో పలువురు భక్తులు ప్రత్యేక చొరవతో గత రెండు నెలల నుంచి ఆలయం పైభాగానికి మరమ్మతులు చేయిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. అక్రమంగా మొరం తవ్వకాలు



తలమడుగు: మండలంలోని కజ్జర్ల, పోన్నారి శివారులో మొరం అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈవిషయాన్ని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మొర్రం తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: ఇమ్రాన్‌ఖాన్, తహసీల్దార్, ఫోన్: 77310 04500

ఘనంగా ఎంఎస్పీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఇచ్చోడ పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌక్‌లో ఆదివారం మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బాక సుభాష్ జెండా ఆవిష్కరించారు. ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ కుడాల స్వామి హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరిసిల్ల భూమయ్య, కళ్లెపెల్లి రాజు, మచ్చ గంగయ్య, కె.విష్ణు, గోట్ ముక్కులే మధుకర్, జన్నారపు సాహెబ్ రావు, జల్ల నరసయ్య, మల్లేష్, అడెల్లు, రమేష్ పాల్గొన్నారు.

గాదిగూడ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

నార్నూర్: గాదిగూడ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆదివారం గాదిగూడ ఎంపీపీ అడ చంద్రకళ రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్, పశువైద్యం కేంద్రం, వ్యవసాయశాఖ భవనం, ఐకేపీ భవనం, ఎంఈవో కార్యాలయం నిర్మించాలన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో 2019లో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్, డిగాంబర్, ఉప సర్పంచ్, చంద్రకాంత్, మారెగాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బేల: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా రూ.5 లక్షలతో నిర్మించనున్న బుద్ధవిహార్ నిర్మాణ పనులు సైతం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ అవసరమైన ప్రాంతాల్లో సబ్ సెంటర్లను నిర్మించి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూస్తున్నామన్నారు. ఆరోగ్యపరంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, వంశీకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, గంభీర్ ఠాక్రే, సతీష్ పవార్, మంగేశ్ ఠాక్రే, పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

ఆదిలాబాద్‌టౌన్: సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్లు పవన్‌నాయక్, అశోక్‌స్వామి, కొండ గణేష్, సాజిదొద్దీన్ పాల్గొన్నారు.

నేడు పీహెచ్‌సీ వస్తువులకు వేలం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత వస్తువులు, ఎలక్ట్రికల్ వస్తువులు, వైద్య పరికరాలు, ఇనుప వస్తువులు, ఇతర ఫర్నిచర్ అమ్మకం కోసం ఈనెల 9న వేలం నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ భీంరావ్ తెలిపారు. ఆసక్తిగల వారు రూ. వెయ్యి సెక్యూరిటీ డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన చెలిమెల లచ్చన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ ఆదివారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కుమారి మాజీ సర్పంచ్ నంది అడెల్లు, వీడీసీ మాజీ చైర్మన్లు పోతగంటి ప్రవీణ భూతి తులసీదాస్, ఎంపీటీసీ సవిత చంద్రశేఖర్, మాధవ్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్, భూతి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న పాయల్ శంకర్

బేల: మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో గత వారం రోజులుగా కొనసాగిన బాజీరావు మహరాజ్ సప్తాహం శనివారంతో ముగిసింది. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి జీవితంలో ఆధ్యాత్మిక మార్గమే అన్నిటికన్నా ఉత్తమమమైనదన్నారు. బాజీరావు మహరాజ్ తన జీవితాన్ని సమాజం కోసం త్యాగం చేశారని, ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. అంతకు ముందు పల్లకి ఊరేగింపు, భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేష్ రెడ్డి, దత్త, ముకుంద్, అశోక్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన సోన్‌టాకే శివ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం గ్రామానికి చేరుకుని శివ తండ్రి నగేష్‌ను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్, సర్పంచ్ నందిశ్వర్, చందు, కేవల్‌సింగ్, చట్ల వినిల్ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు

ఇంద్రవెల్లి: ఈనెల 21 నుంచి నాగోబా జాతరలో ఉన్నందున మెస్రం వంశీయుల విన్నపం మేరకు ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు రోడ్డు మరమ్మతులు అధికారులు ప్రారంభించారు. గుంతలమయంగా మారిన రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేశారు. నాగోబా జాతరకు వచ్చే భక్తులకు, మెస్రం వంశీయులకు ఎలాంటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఇరుముడి ధారణ పూజ

జైనథ్: మండలంలోని కౌఠ గ్రామంలో ఆదివారం అయ్యప్ప స్వాములు ఇరుముడి ధారణ పూజలు నిర్వహించారు. 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములు దీక్షలు చేపట్టిన అనంతరం, దీక్ష విరమణ కోసం శబరిమలై వెళ్తున్న సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పాటలు పాడుతూ.. భజనలు చేస్తూ.. స్వామి వారికి ప్రత్యేక పూజలు ఇరుముడి ధరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ హాజరై పూజలు చేశారు. ఆయన వెంట బింగి వెంకన్న, ముకుంద్ రావ్, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకి తరలిన అయ్యప్పస్వాములు

తాంసి: 41 రోజుల పాటు నియమ నిష్టలతో అయ్యప్ప మాల ధరించిన అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలైకి బయలుదేరారు. మండల కేంద్రానికి చెందిన 25 మంది స్వాములు రామలింగేశ్వర ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టి ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరిమలై అయ్యప్ప దర్శనానికి బయలు దేరారు. కార్యక్రమంలో గురుస్వాములు నరేష్, రాజన్న, సతీష్, ప్రశాంత్, శివ, భూమన్న పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలో ఈనెల 13, 14న నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు అశోక్, సురేఖ, కిష్టన్న, శ్రీనివాస్, ఇస్తారి, గణేష్, మోయినొద్దీన్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 14న వీరజవాన్ల దినోత్సవం జరుపుకోవాలి



సైకిల్ యాత్రికుడు రఘుతో సార్క్ హ్యూమర్ రైట్స్ నాయకులు

ఆదిలాబాద్: ఫిబ్రవరి 14న వీర జవాన్ల దినోత్సవంగా జరుపుకోవాలని కోరుతూ సైకిల్ యాత్రికుడు రఘు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా నుంచి ఢిల్లీ వరకు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఇందులో భాగంగా యాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు సార్క్ హ్యూమన్ రైట్స్ ఆదిలాబాద్ వారు ఘన స్వాగతం పలికారు. ఇందులో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్‌కిరణ్, మీడియా ఇన్‌చార్జి కేంద్రే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ఎదులాపురం: దానాల్లో కెల్ల అన్నదానం గొప్పదని స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం రోగుల బంధువులు, పేదలకు సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు భూరె సురేష్, రాకేష్, రాధాకృష్ణ, రామకృష్ణ, సాయి, కిరణ్, గంభీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యమేది?

- నామమాత్రంగానే గ్రామసభలు
- అవగాహన కల్పించని అధికారులు



వడూర్‌లో గ్రామసభకు తక్కువ సంఖ్యలో హాజరైన ప్రజలు (ఫైల్)

నేరడిగొండ: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు పాల్గొని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్చిస్తారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల నమోదును సైతం గ్రామసభల ద్వారా నిర్వహిస్తుంటారు. వీటితోపాటు ప్రభుత్వాలు ఏమైనా కొత్త పథకాలు చేపట్టాల్సి ఉన్నా.. సభల ద్వారానే ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గ్రామసభలు జిల్లాలో నామమాత్రంగా సాగుతున్నాయి.

గ్రామసభల నిర్వహణ తీరు..

- గ్రామ పంచాయతీల్లో సభ నిర్వహించే తేదీని ఒక రోజు ముందుగానే ప్రజలకు తెలియజేయాలి.
- గ్రామ పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో గ్రామసభల సమాచారాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో దండోరా చేయించాలి.
- నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖలకు చెందిన అధికారులు.. జనాభాలో సుమారు 20 శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరయ్యేలా చూడాలి.
- రెండు నెలలకోసారి, సర్పంచులు లేక ప్రత్యేకాధికారులు పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించాలి. కనీసం 50 మందితో సభ నిర్వహించవచ్చు. సరిపడ మంది రాకుంటే వాయిదా వేయవచ్చు.
- సభకు హాజరయ్యే అధికారులు సమస్యలను నమోదు చేసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారు. అభివృద్ధి పనులు, కార్యాచరణపై చర్చ జరుగుతుంది. పంచాయతీల ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపిస్తారు.

గ్రామసభలకు దూరంగా ప్రజలు..

జిల్లాలోని బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్, ఉట్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్, మావల, ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్, జైనథ్, బేల, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది మంది కూడా రావడం లేదు. ప్రజాప్రతినిధులు, మాజీలు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలు, నాయకులకు అంతగా సమాచారం ఉండడం లేదు.

స్వచ్ఛందంగా సభకు రావాలి



గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులు టాంటాం(దండోరా) వేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలి.

- శ్రీనివాస్, డీపీవో, ఆదిలాబాద్

జిల్లా కార్యవర్గం ఎన్నిక



విజయ్‌శేఖర్



జాదవ్ శివాజీ

ఉట్నూర్: మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డీవీ రాము ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండ్యాల విజయ్‌శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ శివాజీ, గౌరవ అధ్యక్షుడిగా మాడవి లక్ష్మణ్, అసోసియేట్ అధ్యక్షుడిగా టేకం గోవింద్‌రావ్, కోశాధికారిగా చౌహాన్ నెహ్రు, ఉపాధ్యక్షులుగా యాసిన్ షరీఫ్, జె.రాజేశ్, ఆడె కైలాస్, కె.గోపాల్, జి.రాములు, ఏ.ఇందిరా, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ సంతోష్, మహిళా కార్యదర్శిగా ఆర్.పుష్పలత, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఏ.భూమేశ్, బి.రాందాస్, ఎస్.సురేందర్, సీహెచ్ జావిందర్, వి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, తదితరులు ఎన్నికయ్యారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఈశ్వరీబాయి

ఇంద్రవెల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హెల్ఫ్ వీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్త్రీ సాధికారత కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంబ్లే అతిష్, భాస్కర్, ప్రతిమ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సత్యవర్ధన్, బుద్ధివాన్, బాబా, సంతోష్ పాల్గొన్నారు.